చిన్నచూపు ధోరణికి అవకాశం ఇవ్వొద్దు


క్యూరేటర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గడ్డం జ్ఞానేశ్వర్

నాంపల్లి: నాలుగో తరగతి ఉద్యోగులపై చిన్నచూపు ధోరణికి అవకాశం ఇవ్వొద్దని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధికారులను కోరారు. గురువారం గడ్డం జ్ఞానేశ్వర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం నెహ్రూ జూపార్కు క్యూరేటర్ వసంతను మర్యాదపూర్వకంగా కలిసి నియామక శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ అధికారులు, ఉద్యోగులు ఒక కుటుంబంలాగా కొన్ని దశాబ్దాలుగా సేవలందిస్తున్నారని వివరించారు. ఇటీవల కాలంలో కొందరు అధికారులు నాలుగో తరగతి ఉద్యోగులపై చూపిన ధోరణి జూపార్కులోని మెజార్టీ ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీశాయని గుర్తు చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన క్యూరేటర్ ఉద్యోగుల్లో నెలకొన్న అభద్రతా భావాలను తొలగించేలా పాలన కొనసాగిస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి ధన్‌రాజ్, సంయుక్త కార్యదర్శి ఆర్.పాపయ్య, సహాధ్యక్షులు ఎండీ అతీక్ పాష, యూనిట్ అధ్యక్షులు ఎస్.డానియేల్, కోశాధికారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి


టోలిచౌకీ వద్ద పనులను పరిశీలిస్తున్న కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టోలిచౌకీ చౌరస్తాలో జరుగుతున్న పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని, దీనికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. వర్షాకాలం కంటే ముందు ప్రారంభమైన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. టోలిచౌకీ ఫ్లై ఓవర్ కింద పైప్‌లైన్‌లను ఆయన పరిశీలించి దానిపై వాడుతున్న ఇనుప జాలీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా టోలిచౌకీ డివిజన్‌లోని విరాసత్‌నగర్, బాల్‌రెడ్డినగర్ కాలనీల్లో సైతం వరద నీరు ఎక్కడికక్కడ ఆగిపోతుందన్నారు. అనంతరం ఆయన ఎండి లైన్స్, కంపెనీ బాగ్, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, అబీబ్ చౌస్ ఉన్నారు.

బీఎస్ఎన్ఎల్ బలోపేతానికి కృషి


నియామకపత్రాన్ని అందుకుంటున్న షేక్ సుల్తాన్

విజయనగర్‌కాలనీ: బీఎస్ఎన్ఎల్ అడ్వైజరి కమిటీ సభ్యుడిగా విజయనగర్‌కాలనీకి చెందిన షేక్ సుల్తాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ సంస్థను బలోపేతం చేయడంలో తనవంతు కృషి చేస్తానన్నారు. లాభాపేక్ష లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న బీఎస్ఎన్ఎల్‌కు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. అంతకు ముందు నగరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ చేతుల మీదుగా ఆయన బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడిగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

24న గోమాత మహోత్సవం


సమర్థ కామదేను గోశాలలో కొలువుదీరిన గోమాత

జియాగూడ: జియాగూడ నారాయణ ఆశ్రమ శ్రీ సమర్థ కామదేను గోశాలలో ఈ నెల 24న ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు సుందర కాండ (తులసి మానస) హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతుందని ఆశ్రమ మఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే గోమాత మహోత్సవం, గో పూజా, గో సంకీర్తన, గో సేవా, హారతి, చివరగా మహా ప్రసాద వితరణ, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సకల దేవతల దివ్య దర్శనం, అన్నప్రసాదాన్ని తీసుకోవాలని కోరారు.

గోషామహల్‌లో సమగ్ర సర్వే పరిశీలన


డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌తో కలిసి సర్వే వివరాలు పర్యవేక్షిస్తున్న ప్రియాంక ఆల

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వేను జీహెచ్ఎంసీ సర్వే పర్యవేక్షకురాలు, ఐఏఎస్ అధికారిణి ప్రియాంక ఆల పలు ప్రాంతాల్లో పర్యవేక్షించారు. గురువారం జాంబాగ్, గోషామహల్, హిందీనగర్, ఎంజే మార్కెట్ ప్రాంతాల్లో అబిడ్స్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌తో కలిసి పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ సర్వే వివరాలను విద్యాధర్ ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రియాంక ఆల మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో సమగ్ర కుటుంబ సర్వే క్లుప్తంగా కొనసాగుతుందన్నారు. ప్రజలు ముందుకు వచ్చి సర్వేలో పాల్గొంటున్నారని ఆమె తెలిపారు. డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా ప్రతి ఇంటిని సర్వే చేసేందుకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు పూర్తి సహకారం అందించి సర్వే వివరాలను తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి


ప్రపంచ మత్స్యకార దినోత్సవాల్లో మెట్టు ప్రసాద్

అబిడ్స్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని జాతీయ మత్స్యశాఖ అసోసియేషన్ చైర్మన్ మెట్టు ప్రసాద్ పేర్కొన్నారు. ఆగాపురాలో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు ప్రసాద్ మాట్లాడుతూ..మత్స్యకారుల సంక్షేమానికి తాను ముందుంటానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి మత్స్యకారుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పు పద్మ, వినోద్, మెట్టు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయడంలోనే ఆనందం


పండ్లు పంపిణీ చేస్తున్న రాజేందర్ కుమార్ గుప్తా

అఫ్జల్‌గంజ్: సమాజ సేవ చేయడంలోనే ఎంతో ఆనందం ఉంటుందని మాధుర్ వైశ్య శాఖ రాష్ట్ర నాయకుడు రాజేందర్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. తాను నిరంతరం అన్ని ప్రాంతాల్లో రోగులకు, నిరుపేదలకు, వృద్ధులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆసుపత్రులకు వెళ్లి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ..నిరంతరం సమాజ సేవలు చేసేందుకు ముందుంటానన్నారు. ప్రతినెలా కొన్ని ప్రాంతాల్లో పర్యటించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

కురుమ కులస్తుల అభ్యున్నతికి కృషి : ఎంపీ ఈటల


ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో కురుమ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలో కురుమలకు జనాభా ప్రాతిపాదికన రాజకీయ, సామాజిక స్థాయిలో సరైన న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరుతూ గురువారం కురుమ సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం బీసీలు, పేద బడుగు వర్గాలకు సరైన సామాజిక న్యాయం జరిగేలా చూడడానికి కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో మాత్రం బీసీ వర్గాలకు చెందిన కురుమలు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం సామాజికంగా బలంగా ఉన్న వారికే అధిక ప్రాధాన్యం ఇస్తూ వారికి ఎన్నో పదవులు కట్టబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు దేవర శ్రీనివాస్, కోశిక శ్రీనివాస్‌రావు, బీజేపీ కౌన్సిలర్ గొంగిళ్ల మహేశ్వర్, పెంటప్ప, సాగర్ తదితరులున్నారు.

వెచ్చని నేస్తాలు వచ్చేశాయ్..

- చలికి చెక్ పెట్టే ఉన్ని దుస్తుల ఎగ్జిబిషన్
- అందుబాటులో రంగు రంగుల దుప్పట్లు, స్వెటర్లు
- ఆకట్టుకుంటున్న వివిధ రకాల వెచ్చని దుస్తులు





చార్మినార్: శీతాకాలం వచ్చిందంటే.. చాలు ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది వెచ్చని దుప్పటి. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఈ చలి బారి నుంచి తమను తాము కాపాడుకోవడానికి మార్కెట్లు, వస్త్రాల దుకాణాలకు వెళ్లి స్వెటర్లు, దుప్పట్లు, మంకీ క్యాప్‌లు, రూమాళ్లు, మఫ్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి దుస్తులకు పాత బస్తీ మదీన చౌరస్తాలోని వందేళ్ల క్రితం నాటి మహమ్మద్ క్యాప్ మార్ట్ ఎంతో పేరు గాంచింది. చలికాలం దృష్ట్యా పేదలు, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధర, నాణ్యమైన స్వెటర్లు, చలి నుంచి రక్షించే దుస్తులు నేపాల్, పంజాబ్, హరియాణా, మధ్యప్రదేశ్, బంగ్లాదేశ్, రష్యా తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఈ మేరకు నెల రోజుల పాటు ప్రత్యేక ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు.

లేటెస్ట్ మోడల్స్..

ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం సందర్భంగా మహమ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఇలియాస్ బుకారి మాట్లాడుతూ..ఈ సారి మరిన్ని కొత్త డిజైన్లతో స్వెటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎముకలు కొరికే చలి ఉన్నప్పటికీ ప్రజలు వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సిన వారి కోసం కొత్త కొత్త డిజైన్ల స్వెటర్లు, ఉన్నీ కవర్‌తో ఉన్న దుస్తులు, క్యాప్‌లు, మంకీ క్యాప్‌లు, చెవులకు మాత్రమే కప్పుకునేలా మఫ్లార్లు, అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో పాటు చలి బెంగా లేకుండా నిద్రపోయేలా మందంతో కూడిన ప్రత్యేకమైన దుప్పట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ రకాల రంగులు, ప్రత్యేకమైన డిజైన్లతో కూడిన స్వెటర్లు ఉన్నాయి.

అనాథాశ్రమాలు, హాస్టల్ విద్యార్థులకు రాయితీతో..

మలేషియా, సింగపూర్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియాలో మైనస్ 35 డిగ్రీ తట్టుకునే స్వెటర్లు, విదేశీ జాకెట్లు కూడా అందుబాటులో ఉన్నాయని ఇలియాస్ బుకారి తెలిపారు. మధ్య తరగతి, హాస్టళ్లు, అనాథాశ్రమాలకు రాయితీ కూడా ఇస్తున్నామన్నారు. సరసమైన ధరకు విక్రయిస్తుండటంతో వివిధ రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి తమ వద్ద హోల్‌సేల్‌గా కొనుగోలు చేసుకుంటారన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు వీలు లేకపోతే ఆర్డర్లపై ట్రాన్స్‌పోర్టు ద్వారా అందజేస్తున్నామన్నారు.

ఆయుష్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



గోల్కొండ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బస్తీ దవాఖానాల్లో ఆయుష్ వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభిస్తున్నారని గుడిమల్కాపూర్‌లోని కార్వాన్ బస్తీ దవాఖానా వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం బస్తీ దవాఖానాలో ఆయుష్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ నాయకుడు దేవర వంశీ మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ బస్తీ దవాఖానాల్లో ఆయుష్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. డాక్టర్ నర్మద, డాక్టర్ లక్ష్మీదేవి తదితరులున్నారు.

ప్రాచీన కళారూపాలను పరిరక్షించుకోవాలి



నాంపల్లి: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జానపదం నాటక రిపర్టరీ సంస్థల సంయుక్తాధ్వర్యంలో గురువారం రాత్రి నాంపల్లిలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో చెర్విరాల భాగయ్య రచించిన గురువులు చిందుల శ్యామ్, దెంచనాల శ్రీనివాస్ దర్శకత్వంలో చిందు యక్షగానం శైలిలో 'మాంధాత చరిత్ర' నాటకాన్ని ప్రదర్శించారు. సుమారు 90 నిమిషాల నిడివితో రూపొందించిన ఈ ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అతిథులుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనా చారి, గోరటి వెంకన్న హాజరై మాట్లాడారు. ప్రాచీనమైన కళారూపాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

24న ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్

నాంపల్లి: బజ్మే కక్షాన్ లిటరరీ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, న్యాయవాది మహ్మద్ అసద్ అలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మల్లేపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. మల్లేపల్లి డివిజన్ అఫ్జల్‌సాగర్‌లోని మహమూద్ ఆసుపత్రి సమీపంలోని మహమూద్ టవర్ మూడవ అంతస్తులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. పలువురు న్యాయ నిపుణులు హాజరై బాధితులకు ఉచితంగా న్యాయ సలహాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. లీగల్ నోటీస్, గిఫ్ట్‌డీడ్, సేల్ డీడ్, వీల్ డీడ్, పార్టీషన్ సూట్, జీపీఏ, మెయింటెనెన్స్, మెటర్నటీ బెనిఫిట్స్, డొమెస్టిక్, డైవర్స్ ఖులా, సర్వీస్ మ్యాటర్, ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులకు సంబంధించి సహాయం చేస్తారని తెలిపారు. స్థానిక నిరుపేదలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 99596 72740 లో సంప్రదించవచ్చని సూచించారు.

ఘనంగా బాలరత్న అవార్డుల ప్రదానోత్సవం


అవార్డులు ప్రదానం చేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్ రావు

సుల్తాన్‌బజార్: కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలరత్న అవార్డు ప్రదానోత్సవం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవార్డుల ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచే చిన్నారులు వివిధ అంశాలపై ప్రతిభ కనబరచడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాట్య గురువు డి.సురేఖ, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతి కమలాకర్, లలిత పరమేశ్వరీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం


కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. గురువారం కార్వాన్ డివిజన్‌లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి మరింత పట్టుదలగా కృషి చేస్తున్నారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేవలం బీఆర్ఎస్ నాయకులే తమ సన్నిహితులతో కలిసి ప్రజలకు చేరాల్సిన సంక్షేమ పథకాలను స్వాహా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి కోసం పరిశ్రమలు స్థాపించడానికి భూములు కేటాయిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడుతూ అధికారులపై దాడులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. పదేళ్లలో తాము చేయలేని అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తుండడం బీఆర్ఎస్ నాయకులకు సహించడం లేదని ఆయన అన్నారు. ఆయన వెంట చంద్రశేఖర్, రాములు, రవీందర్ తదితరులున్నారు.

సమైక్యంగా జీవించినప్పుడే ప్రగతి సాధ్యం


ఎన్ఎస్ఎస్ వలంటీరును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చార్మినార్: మనుషుల మధ్య కులమత ప్రాంతీయభాషా భేదాలను విడిచిపెట్టి సమైక్యంగా జీవించినప్పుడే ప్రగతి సాధ్యమని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్ అన్నారు. హరియాణాలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొని బంగారు పతకం సాధించిన బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థి కార్తీక్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సమైక్య జీవన విధానంపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. ఐదేళ్లుగా సిటీ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ శిబిరాలలో పాల్గొనడమే కాక ఉత్తమ వలంటీర్లుగా ఎంపిక కావటం గర్వకారణమన్నారు. కేంద్ర యువజన క్రీడల శాఖ నిర్వహించిన ఈ శిబిరంలో 14 రాష్ట్రాలలోని 24 విశ్వవిద్యాలయాల నుంచి 220 మంది వలంటీర్లు పాల్గొనగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వెళ్లిన బృందానికి సిటీ కాలేజీ ఆంగ్ల ఆచార్యులు డా.కృష్ణచంద్ర కీర్తి నేతృత్వం వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తీక్‌ను వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేయడం గొప్ప విషయం


కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు అజయ్ మిశ్రా, జనార్దన్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: జనవరి 2026 నాటికి లక్ష మంది యువ పారిశ్రామ వేత్తలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యాన్ని పెట్టుకోవడం ఎంతో గొప్ప విషయమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక కార్యదర్శి విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా అన్నారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ మిషన్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..29 రాష్ట్రాలలో 20 కోట్ల మంది విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాలు రూపొందించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాం యువత గురించి కన్న కలలను లీడ్ ఇండియా ఫౌండేషన్‌తో నెరవేర్చేందుకు ప్రయత్నం చేయడం గొప్ప యజ్ఞం లాంటిదన్నారు. సంస్థ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ ఎస్.బి సుదర్శనాచార్య మాట్లాడుతూ..విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంతో పాటు దేశం ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేయడం తమ ప్రయత్న లక్ష్యమని తెలిపారు. అనంతరం లైఫ్ మిషన్ 2047 కార్యక్రమాల రూపకల్పనను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వెల్లడించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.జనార్దన్‌రెడ్డి, ట్రస్టు అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, రవీంద్రనాథ్, శ్రీధర్, ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



అబిడ్స్: కార్తీకమాసం పూజలు గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి దీపాలంకరణ చేపట్టారు. రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

తోలుబొమ్మలాట కళలను కాపాడుకుందాం


కళాకారులను సన్మానిస్తున్న జస్టిస్ లక్ష్మణ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సంప్రదాయ కళల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. 3వ రోజు అయిన గురువారం ప్రదర్శించిన తోలుబొమ్మలాట నాటక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న తోలుబొమ్మలాట కళను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య లక్ష్మీనారాయణ, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

డీఈకి వినతి


డీఈ పర్వత్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్: 20 ఏళ్ల క్రితం నిర్మించిన బిల్డింగ్స్, కాంప్లెక్స్‌ల నిర్వాహకులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ నోటీసులు జారీ చేయడం దారుణమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బేగంబజార్ డీఈ పర్వత్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..పలు పాత భవనాలకు ఎలక్ట్రిసిటీ ఇంజినీరింగ్ అధికారులు నోటీసులు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. వెంటనే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని లేనిచో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దీపక్ సింగ్, విజయ్ ముదిరాజ్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియాపై అవగాహన కల్పించాలి


సదస్సులో పాల్గొన్న చంద్రకాంత్ అగర్వాల్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతదేశంలో 5 కోట్ల మంది ప్రజలు తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తెలిపారు. గురువారం తలసేమియా సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా సవాళ్లు- పరిష్కారాలు అనే అంశంపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తలసేమియా నివారణ గురించి అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యాధికారులు, వైద్య నిపుణులు, ఎన్జీఓ ప్రతినిధులు రోగుల సంరక్షణను మెరుగుపరచడానికి, అవగాహన, పరిష్కారాల కోసం పని చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు, ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

దండు శంకర్ మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న మహేష్ గౌడ్

గన్‌ఫౌండ్రీ: మూసీ నది ప్రక్షాళనపై సీనియర్ నాయకుడు దండు శంకర్ తీసిన డాక్యుమెంటరి చిత్రాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించేలోపు ఆయన మృతి అత్యంత బాధాకరమని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకులు దండు శంకర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, మాజీ ఎంపీ వి.హన్మంతరావుతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'కోట'లో విద్యార్థుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోటలో గురువారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోటలోని ఫిరంగులు, ఆయుధాలు చూస్తూ సంబరపడ్డారు. అనంతరం వారు అకన్నమాదన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన వారసత్వ కట్టడాల ఛాయాచిత్రాలను చూస్తూ దేశంలో గల ప్రముఖ కట్టడాల విశేషాలను తెలుసుకున్నారు. ప్రదర్శనలో ఉంచిన ప్రాచీన ఆలయాలు, కోటలు, భవనాల వివరాలను వారి వెంట ఉన్న ఉపాధ్యాయులు పిల్లలకు వివరించారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: లావణ్య ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్ర కె.ప్రభాకర్ రచించిన ప్రేరణ పుస్తకావిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోనే పలు అంశాలపై కవిత్వం, రచనలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఉర్దూ కవిత్వాలను సైతం తెలుగులో ఎంతో స్పష్టంగా అందరికి అర్థమయ్యేలా రచయిత రాసిన తీరు ఎంతో బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త ఏనుగు నర్సింహారెడ్డి, సంస్కృత అకాడమీ సంచాలకులు పెన్నా మధుసుదన్‌రావు, నటులు కాకరాల, దర్శకుడు రాంచంద్రరావు, చిత్రకారులు పి.శ్రీనివాస్, సంస్థ అధ్యక్షుడు చికోలు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.